పేదల పక్షాన వైఎస్సార్ సీపీ పోరాటం



పేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, జెడ్పీచైర్మన్ ఘంటా పద్మశ్రీ



అంకన్నగూడెంలో ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలుకుతున్న ప్రజాప్రతినిధులు, మహిళలు, నాయకులు

- రూ.2,800 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం
- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- కోలాహలంగా ప్రజా ఆశీర్వాద పాద యాత్ర

పెదవేగి : పేదల పక్షాన వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తోందని, వారి అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి అలుపెరగకుండా కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. దెందులూరు నియోజకవర్గాన్ని రూ.2,800 కోట్లతో అభివృద్ధి చేశానని ఆయన అన్నారు. మొదటి విడతగా 100 కిలోమీటర్లు, దాదాపు 23 గ్రామాలు పాదయాత్ర చేపట్టిన అబ్బయ్యచౌదరికి అశేష జనవాహిని నడుమ కోలాహలంగా 2వ రోజు కొనసాగింది. శుక్రవారం ఉదయం కొప్పాకలో పల్లె నిద్ర అనంతరం ప్రారంభమైన ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి రెండో రోజు ప్రజా ఆశీర్వాద యాత్రకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కొఠారు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహానేత వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొప్పాకలో 100 మందికి జగనన్న ఇళ్ల పట్టాలు పంపిణీ

కొప్పాకలో 100 మంది అక్కచెల్లెమ్మలకు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి జగనన్న ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి వారి సొంతింటి కలను సాకారం చేశారు. అర్హులైన మిగతా వారికి ఇళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కొప్పాక ఉన్నత పాఠశాలను సందర్శించి, నాడు-నేడు పనులను పరిశీలించి, ఆడుదాం-ఆంధ్రా నేపథ్యంలో కొప్పాక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు అందజేసిన ఎమ్మెల్యే విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ప్రజా ఆశీర్వాద యాత్ర కొప్పాక నుంచి అంకన్నగూడెం చేరింది. కొప్పాక సచివాలయంలో మధ్యాహ్న భోజన చేసిన అనంతరం ఎమ్మెల్యే తిరిగి ప్రజా ఆశీర్వాద యాత్రను ప్రారంభించారు. కొప్పాకగూడెం, బి శింగవరం, ప్రధాన రహదారికి అబ్బయ్యచౌదరి శంకుస్థాపన చేశారు. బి శింగవరం నుంచి ప్రకాష్‌నగర్ బస ప్రాంతానికి అభిమానులు, నాయకులు, కార్యకర్తల తరలి వచ్చారు. ఎమ్మెల్యే గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా మీ అందరికీ ఆశీర్వాదంతో నియోజకవర్గంలో దాదాపుగా రూ.2,800 కోట్ల నిధులు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఖర్చు చేసినట్లు తెలిపారు. రాబోయే ఎన్నికలు పేదవారికి పెత్తందారులకి జరగబోయే యుద్ధమని, వైఎస్సార్ సీపీ జెండా ఎప్పుడు పేదవారితోనే ఉంటుందని వివరించారు. చింతమనే హయాంలో ఒక్క సెంటు స్థలం కొని పేదవారికి ఇవ్వలేకపోయారని విమర్శించారు. మొదటి విడతగా నాలుగున్నర ఎకరాల పొలం కొని 118 మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చామని అబ్బయ్యచౌదరి అన్నారు. మీకు మేలు జరిగితేనే వైఎస్సార్ సీపీకి 2024లో ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గ ప్రసాద్, జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సొసైటీ అధ్యక్షులు, పార్టీ అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేంద్ర పథకాలపై అవగాహన



గ్రామ సచివాలయం వద్ద ప్రభుత్వ పథకాల పోస్టర్లను ప్రదర్శిస్తున్న నాయకులు అధికారులు

పెదపాడు: కేంద్ర ప్రభుత్వం 17రకాల సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తోందని పలువురు వక్తలు పేర్కొన్నారు. పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్రం అందిస్తున్న పథకాలను వివరించారు. పథకాలు అమలు చేసే విధానంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్ సూర్యకుమార్, తహసీల్దార్ విజయ్‌కుమార్ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి ప్రదీప్‌కుమార్ పెదపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యుడు చక్రధర్, అనంతపాల్, బీజేపీ నాయకులు జీ చైతన్య, మండల బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాస్ పలువురు ప్రభుత్వ శాఖాధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సేవల పునరుద్ధరణ



అంగన్‌వాడీ కేంద్రంలో తాళాలు పగులకొట్టిన సచివాలయ ఉద్యోగులు

దెందులూరు: దెందులూరు మండలంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు సేవలు ప్రారంభించామని ఐసీడీఎస్ పెదపాడు సెక్టార్ సీడీపీఓ విజయలక్ష్మి అన్నారు. దెందులూరు మండలంలో ఉన్న అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు టీచర్లు, ఆయాలు తాళాలు వేసిన సంగతి విదితమే. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఐదుగురు సచివాలయ సిబ్బందితో ప్రతి సెంటరులో తాళాలు పగులకొట్టి ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని యథావిధిగా సిబ్బంది ద్వారా అందిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు ప్రభుత్వం ద్వారా అందించే ఆహారాన్ని అడ్డుకోవడం, తాళాలు వేయడం బాధాకరమన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో పీఈటీ విద్యార్థుల ప్రతిభ



ఓవరాల్ ఛాంపియన్‌షిప్ పొందిన పీఈటీ విద్యార్థులు

దెందులూరు: వ్యాయామ విద్య భవిష్యత్తులో ఉజ్వల అభివృద్ధి లభిస్తుందని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యాకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నత్తానియేల్ అన్నారు. వ్యాయామ కళాశాల విద్యార్థులు రాజమండ్రిలో నిర్వహించిన ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ పరిధిలో అంతర్ కళాశాలల క్రీడా పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి అథ్లెటిక్స్ గేమ్‌లో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. 400 మీటర్ల పరుగు పందెంలో ఆర్.అలేఖ్య, రేస్ వాక్‌లో మౌనిక, త్రోలో అఖిల, షార్ట్‌పుట్‌లో సరోజిని, హైజంప్‌లో భారతి, జావలెన్ త్రోలో జగన్నాథం మొదటి స్థానాల్లో నిలిచి ఓవరాల్ చాంపియన్‌షిప్ గెలుపొందారన్నారు. శుక్రవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను ప్రిన్సిపల్ నత్తానియేలు, అధ్యాపకులు అభినందించారు.

హోంమంత్రిని కలిసిన ఎస్సీ నాయకులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు విచ్చేసిన హోంమంత్రి తానేటి వనితను పలువురు ఎస్సీ నాయకులు శుక్రవారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జాతీయ ఎస్సీ నాయకులు పొలిమేర హరికృష్ణ మాట్లాడుతూ హోంమంత్రి వనిత భవిష్యత్తులో మరింత ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. హోంమంత్రిపై బురద చల్లే కార్యక్రమాలను ఆయన ఖండించారు. తామంతా హోంమంత్రి వనిత వెంటే ఉన్నామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కొత్తపల్లి బాబూరావు,ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపు పాటించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యుత్ పొదుపు వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక విద్యుత్ భవన్‌లో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో ఏలూరు నగరంలోని వివిధ పాఠశాలల నుంచి 217 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈపీడీసీఎల్ డీఈ టెక్నికల్ ఎం ఝాన్సీ మాట్లాడుతూ రేపటి తరానికి తగిన విద్యుత్ అందించేందుకు నేటి పౌరులు పొదుపు పాటించాల్సిన అవసరం ఉందని, ఇది విద్యార్థి దశ నుంచే అవగాహన ఏర్పడాలని అన్నారు. అనంతరం విద్యార్థులు, ఉద్యోగులతో ఆమె ఇంధన పొదుపుపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఈఈ జేపీవీ నటరాజన్, విజిలెన్స్ సీఐ వి.రవి కుమార్, ఓసీ ఉద్యోగుల సంఘం నాయకులు తురగా రామకృష్ణ, సీహెచ్ సాయి బాబా, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు క్రీడాకారిణుల ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన రంజనీ, నిర్మలతో కోచ్ కృష్ణకుమారి

భీమడోలు: పోలసానిపల్లి బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల స్పోర్ట్స్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు పరుగు పందెంలో ప్రతిభను చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 19 గేమ్స్ మహిళా విభాగంలో గుంటూరు జిల్లా నరసరావుపేటలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో వి.రంజిని, బి.నిర్మలలు పరుగు పందెం పోటీల్లో ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వి.రంజిని 400 మీటర్లు, 200 మీటర్లు, 400 రిలే పరుగులో బంగారు పతకాలు సాధించిందన్నారు. బి.నిర్మల 400 మీటర్లు, 400 రిలే పరుగులో వెండి పతకాన్ని సొంతం చేసుకుని సత్తా చాటింది. ఈ ఇద్దరు క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారికి ప్రశంసా పత్రాలను, పతకాలను అందించారు. ఈనెల 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు మహారాష్ట్రలో పోటీలు నిర్వహించనున్నట్టు కోచ్ కృష్ణకుమారి శుక్రవారం తెలిపారు. జాతీయ పోటీలకు ఎంపికైన ఇద్దరు క్రీడాకారిణిలను, కోచ్ జి.కృష్ణవేణిని ప్రిన్సిపల్ వి.వెంకటరమణ అభినందించారు.

సాబ్జీకి నివాళులర్పించిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి



ఎమ్మెల్సీ షేక్ సాబ్జీతో ప్రజా ఆశీర్వాద యాత్రపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి(ఫైల్)

పెదవేగి/దెందులూరు: అత్యంత ఆప్తులు, దెందులూరు నియోజకవర్గం వట్లూరు నివాసి అయిన ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మరణం తీరని లోటని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆవేదన వ్యక్తం చేశారు. పెదవేగి మండలం అంకన్నగూడెంలో ప్రజా ఆశీర్వాద యాత్ర చేస్తున్న అబ్బయ్యచౌదరికి రోడ్డు ప్రమాదంలో సాబ్జీ మరణించిన విషయం తెలిసి విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు కొండంత అండగా నిలుస్తూ, ఉద్యమ నాయకుడిగా తన గళాన్ని వినిపించారని అన్నారు. ఇటీవల షేక్ షాబ్జీని కలిసినప్పుడు, ప్రజా ఆశీర్వాద యాత్ర విషయం తెలియజేయడంతో ప్రోత్సహించడంతోపాటు తాను కూడా పాల్గొంటానని చెప్పారని ఎమ్మెల్యే కొఠారు గుర్తు చేసుకున్నారు. ఇంతలోనే ఆయన లేరన్న మరణ వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని ఎమ్మెల్యే విచారం వ్యక్తం చేశారు. షేక్ సాబ్జీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు అబ్బయ్యచౌదరి చెప్పారు. యూటీఎఫ్, వైఎస్సార్‌టీఎఫ్ సంతాపం: ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ ఆకస్మిక మరణం బాధాకరమని వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర నాయకులు పీజే కెనడీ, యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు బీవీ రమణమూర్తి అన్నారు. శుక్రవారం దెందులూరులో ఎమ్మెల్సీ ఆకస్మిక మరణవార్తపై వారు సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు.

ఎమ్మెల్సీ సాబ్జి మృతిపై ఉపాధ్యాయుల సంతాపం

ఉంగుటూరు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ బాబ్జి హఠాన్మరణం ఉంగుటూరు మండలంలో ఉపాధ్యాయులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎమ్మెల్సీకి ముందు ఆయన యూటీఎఫ్ నాయకుడిగా ఉంగుటూరు మండలంలోని నాయకులతో అవినాభావ సంబంధం ఉంది. సాబ్జి ఎమ్మెల్సీ అయ్యాక ఉంగుటూరు మండలంలో ప్రతి పాఠశాలకు తీసుకొచ్చి సన్మానించారు. ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి మహాసభలలో సాబ్జి పాల్గొన్నారని యూటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. ఆయన వారికున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గుర్తు చేసుకున్నారు.

కేంద్ర బృందం పర్యటన.. ధాన్యం నమూనాల సేకరణ



దెందులూరులో ధాన్యం నమూనాలను సేకరిస్తున్న కేంద్ర బృందం



పెదపాడు: కొత్తూరులో మొలక వచ్చిన వరి పనలను పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ టెక్నికల్ అధికారి

దెందులూరు: తుపాను కారణంగా దెబ్బతిన్న ధాన్యాన్ని కేంద్ర బృందం సభ్యులు శుక్రవారం దెందులూరులో పరిశీలించారు. దెందులూరు, పోతునూరు, సత్యనారాయణపురం, కొవ్వలి, ఉండ్రాజవరం, పోతునూరు గ్రామాల్లో తుపాను వల్ల దెబ్బతిన్న వరి పొలాలను, ధాన్యం కళ్లాల్లో నమూనాలను సేకరించారు. తుపాను, పంట నష్టం, తదనంతర పరిస్థితులను జిల్లా వ్యవసాయ శాఖాధికారి వై.రామకృష్ణ, అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్బారావును అడిగి తెలుసుకున్నారు. కేంద్ర బృందంలోనే ఐజీఎంఆర్ఎస్ఐ సాంకేతిక అధికారి డాక్టర్ బసంత, ఎఫ్‌సీఐ క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ పీ. వెంకటసారథి, దెందులూరు మండల వ్యవసాయ శాఖాధికారి గద్దె రమేష్‌బాబు ఉన్నారు.

తడిసిన పంటలను పరిశీలించిన ఎఫ్‌సీఐ అధికారి

పెదపాడు: కొత్తూరులోఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు చెందిన క్వాలిటీ కంట్రోల్ టెక్నికల్ అధికారి బసంత్‌కుమార్ తడిసిన ధాన్యాన్ని, వరి పనలను పరిశీలించారు. తుపాను కారణంగా తడిసిన వరి కుప్పలను పరిశీలించారు. తడిసిన ధాన్యం రాసులను పరిశీలించారు. అనంతరం అన్ని మండలాల్లోని ధాన్యం శాంపిళ్లు తీసుకుని వెళ్లి పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. పరీక్షల్లో వచ్చిన ఫలితాల ఆధారంగా ధాన్యం కొనుగోలులో వెసులుబాటు కల్పిస్తామని చెప్పారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట జేడీఏ రామకృష్ణ, ఏడీఏ వై సుబ్బారావు, ఏఓ ప్రదీప్‌కుమార్ రైతులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి పథకాలపై ప్రచారం



మహిళలకు పథకాల బ్రోచర్ అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఉంగుటూరు: ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు సీఎం కావాలంటే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నారాయణపురంలో పల్లెకు పోదాం కార్యక్రమం వైఎస్సార్ సీపీ నాయకులు నిర్వహించారు. ఉంగుటూరు మండల కన్వీనర్ మరడ వెంకటమంగారావు ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికీ తిరుగుతూ, గత ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు, ఈ నాలుగున్నరేళ్ల కాలంలో జగన్‌మోహన్ రెడ్డి చేసిన పథకాలు ప్రజలకు వివరించారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుందామని ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణపురం గ్రామ ఎంపీటీసీ, ఉంగుటూరు మండలం ఎంపీటీసీ ఛాంబర్ అధ్యక్షుడు బండారి నాగరాజు, ఆర్‌బీకే చైర్మన్ మతకమల్లి శ్రీధర్, వార్డ్ మెంబర్ లోకిన వినోద్, సచివాలయ కన్వీనర్లు టీవీఆర్ జగదీష్, జిల్లా పంచాయతీరాజ్ విభాగం ప్రధాన కార్యదర్శి మాజీ ఉపసర్పంచ్ అడపా శ్రీనివాసరావు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

మేట్లకు శిక్షణ



మేట్లకు కొలతల శిక్షణ ఇస్తున్న దృశ్యం

దెందులూరు: జాతీయ ఉపాధి హామీ పథకం లక్ష్యాలను మేట్లు, సీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు సంయుక్తంగా సాధించాలని దెందులూరు మండల ప్రత్యేకాధికారి ఎస్.కృపావరం అన్నారు. శుక్రవారం దెందులూరులో ఉపాధి హామీ ఏపీఓ దశరథరామ్‌జీ, ఎంపీడీఓ భీమరాజు ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల మేట్లకు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఏపీఓ దశరదరామ్‌జీ మాట్లాడుతూ శిక్షణ పొందిన నిబంధనలు మేట్లు క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా పాటించాలన్నారు. వారం రోజులు పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమంలో రోజుకో 50 మంది మేట్లకు శిక్షణనిస్తామన్నారు. మేట్లు అందరూ ఉపాధి శాఖ ఇస్తున్న శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు శ్రావణ్, మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత స్థితి



కొప్పాక ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు విద్య ప్రాముఖ్యతను వివరిస్తున్న ఎంపీడీఓ రాజ్‌మనోజ్

పెదవేగి : ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పెదవేగి ఎంపీడీఓ జి రాజ్ మనోజ్ అన్నారు. శుక్రవారం పెదవేగి మండలం కొప్పాక ఉన్నత పాఠశాల్లో 10వ తరగతి విద్యార్థులకు విద్య ప్రాముఖ్యత, ఉన్నత లక్ష్యాల చేదన తదితర అంశాలపై ఎంపీడీఓ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది 10వ తరగతి ఉత్తీర్ణత కొంత మేర నిరాశ పరిచిందని, ఈ ఏడాది 100 శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యతోనే కుటుంబ ఆర్థిక పరిస్థితి మార్పగలుగుతామని, పేదరికాన్ని అధిగమించేందుకు విద్య ఒక్కటే మార్గం ఎంపీడీఓ చెప్పారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. పేద, మధ్యతరగతి విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం ప్రభుత్వం ఎన్నో ప్రోత్సాహకాలను అందిస్తోందని ఆయన అన్నారు.

సత్యనారాయణకు ఉత్తమ సేవా పురస్కారం

ఉంగుటూరు: జిల్లా ఉత్తమ సేవా పురస్కారాన్ని కోనే వీరవెంకట సత్యనారాయణ అందుకున్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 14న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా భీమవరం డీఎస్ఆర్ కాలేజ్‌లో దివ్యాంగుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. దివ్యాంగుల అభివృద్ధికి, ఉన్నతికి చేస్తున్న సేవలకు కోనే వీర వెంకట సత్యనారాయణకు డీఆర్వో శ్రీమన్నారాయణరెడ్డి జిల్లా ఉత్తమ సేవా పురస్కారంతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల అసిస్టెంట్ డైరెక్టర్ రాకడ మణి, డీఎస్ఆర్ కాలేజీ పాలకవర్గ సభ్యులు, వివిధ అసోసియేషన్ నాయకులు దివ్యాంగులు పాల్గొన్నారు.

80 శాతం సబ్సిడీపై పెసలు పంపిణీ

దెందులూరు: మండలంలో తుపాను కారణంగా పంట నష్టపోయిన గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం 80 శాతం సబ్సిడీపై పెసలు అందిస్తోందని దెందులూరు మండల వ్యవసాయ శాఖాధికారి గద్దె రమేష్ అన్నారు. శుక్రవారం వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బాధిత రైతులు ఆయా గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాల్లో, దెందులూరులో ఏఓ కార్యాలయంలో సంప్రదించాలని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేటి నుంచి షష్ఠి మహోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పోస్టల్ కాలనీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో నేటి నుంచి స్వామి వారి 23వ శాంతి కల్యాణ మహోత్సవాలు, షష్ఠి కల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. తొలిరోజు శనివారం గణపతి పూజ, అఖండ దీక్షాధారణ, మండపారాధన పూజలు చేస్తారు. 17న హోమం, 18న స్వామి మూలమూర్తులకు అభిషేకం, కల్యాణం 19న స్వామికి అభిషేకాలు, 20న నిత్య హోమం బలిహరణ పూజలు, 21న అభిషేకం నిర్వహిస్తామన్నారు.

ప్రాధాన్యత భవన నిర్మాణాలపై అలసత్వం వద్దు



భీమడోలులో వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావలి

భీమడోలు: ప్రభుత్వ భవన నిర్మాణ పనులపై అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఏలూరు ఆర్డీవో, మండల ప్రత్యేకాధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి అన్నారు. భీమడోలు మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ప్రభుత్వ భవన నిర్మాణాల ప్రగతి, స్పందన ఫిర్యాదులు పరిష్కారం, ప్రధానమైన 8 శాఖల పనితీరుపై ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావలి శాఖల వారీగా పురోగతి వివరాలను సంబంధిత అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన హౌసింగ్ మేళా కార్యక్రమంలో భాగంగా నిర్ణీత లక్ష్యం మేరకు 479 నివాస గృహాల నిర్మాణాలను జనవరి నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు. దుద్దేపూడిలో గృహ నిర్మాణాలకు కేటాయించిన ఇళ్ల స్థలాలు పల్లపు ప్రాంతంలోఉన్న కారణంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. సూరప్పగూడెంలో పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాల కాలనీ మెరక చేసే విషయంలో బిల్లుల సమస్యను సంబంధిత అధికారులు పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ఎం.ఇందిరా గాంధీ, ఏవో ఎస్‌పీవీ ఉషారాణి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

పెదపాడు: పేకాట ఆడుతున్న తొమ్మిది మంది వ్యక్తుల నుంచి రూ. 25,040 స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు పెదపాడు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదపాడు మండలంలోని వసంతవాడ గ్రామ శివారు పంట పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో పేకాట స్థావరంపై దాడి చేసి వారి వద్ద నుంచి రూ.25,040 నగదు, ఒక బైక్, 7 సెల్ ఫోన్లు స్వాధీన పరుచుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణ చల్లా తెలిపారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

భీమడోలు: అంగన్‌వాడీ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించి తమను ఆదుకోవాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి.విజయలక్ష్మి అన్నారు. భీమడోలులో అంగన్‌వాడీ సిబ్బంది తన కోర్కెల సాధనకు చేపట్టిన సమ్మె నాల్గవరోజైన శుక్రవారం కొనసాగించారు. ఈ సమ్మెకు జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి.విజయలక్ష్మి మద్దతు తెలిపారు.

అంగన్‌వాడీల నిరసన

పెదవేగి : పెదవేగిలో శుక్రవారం అంగన్‌వాడీ సిబ్బంది నల్ల చీరలు ధరించి ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడి ఎమ్మార్వో కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ మండల కార్యదర్శి ప్రసాద్ అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఐటీయూ జిల్లా నాయకులు పి.హైమావతి హాజరయ్యారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల కార్యదర్శి వీ బేబీరాణి, టి కృష్ణవేణి సెక్టార్ లీడర్లు ఎం. త్రివేణి. ఏ భార్గవి పీపీఎల్ సూర్య కుమారి పాల్గొన్నారు.

భీమడోలు నుంచి శ్రీశైలం క్షేత్రానికి పాదయాత్ర



శ్రీశైలం పుణ్యక్షేత్రానికి పాదయాత్రగా బయలుదేరిన శివస్వాములు

భీమడోలు: భీమడోలులోని శివమాలధారులు శ్రీశైల క్షేత్రానికి శుక్రవారం పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. భీమడోలులోని పార్వతీసమేత భీమేశ్వర స్వామి శివస్వాముల పీఠానికి చెందిన నలుగురు శివస్వామి మాలధారులు సుంకర నారాయణ, మరీదు నాగసురేష్, యడ్ల నాగవెంకట దుర్గా ప్రసాద్, మేడిశెట్టి బాలాజీ 400 కిలోమీటర్ల దూరంగా ఉన్న శ్రీశైలం క్షేత్రానికి పయనమై వెళ్లారు. వారు తొలుత ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు. శివ నామస్మరణతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగింది. ఊరేగింపుగా మాలధారులు బయలుదేరి వెళ్లారు. తొలుత అర్చకులు, గురుస్వాములను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీఠం గురుస్వామి పేరాబత్తుల వెంకటేశ్వరరావు, బాదర్వాడ కృష్ణమోహనరాజు, అర్చకులు కాళ్లకూరి ఉమాశంకర్‌శర్మ, గుండుగొలను అర్చకులు శివ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.